క్లుప్తంగా

మూడో వార్డులో జగనన్నే మా భవిష్యత్తు

మండపేట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. గృహ సారథులు, పార్టీ నాయకులతో కలిసి బుధవారం రాత్రి పట్టణంలోని 3వ వార్డులో ఆమె ఇంటింటికి వెళ్లి ప్రజాభిప్రాయ సర్వే నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మళ్లీ మళ్లీ సీఎంగా జగనే కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. జేసీఎస్ కన్వీనర్ యరమాటి వెంకన్నబాబు, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, శెట్టి కల్యాణి, సచివాలయ కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షలు



వెర్రియ్యకు రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ఆరోగ్య సమస్యతో చికిత్స చేయించుకున్న అంగరకు చెందిన నూకాంబిక అమ్మవారి ఆలయ చైర్మన్ చిక్కాల వెర్రియ్యకు రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. చెక్కును బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా వెర్రియ్యకు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించిన ఎమ్మెల్సీ తోటకు ఈ సందర్భంగా వెర్రియ్య కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట ఎంపీటీసీ సభ్యులు అద్దాల శ్రీనివాస్, మేడిశెట్టి దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు, పార్టీ నాయకులు పసలపూడి శ్రీనివాస్, వంగా శ్రీనివాస్, పాలింగి కిశోర్, ఉప్పులూరి రామకృష్ణ, వాసంశెట్టి వాసు, నంబాబత్తుల స్వామికాపు ఉన్నారు.

ప్రవీణ్‌ప్రకాష్‌ను తొలగించాలంటూ ర్యాలీ

మండపేట: స్కూల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ పిలుపు మేరకు బుధవారం మండపేటలో ఉపాధ్యాయ సంఘాలు నిరసన ప్రదర్శన చేశాయి. స్థానిక కలువపువ్వు సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగిన ర్యాలీలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డీవీ రాఘవులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ ఓ.గోపాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యారంగాన్ని ప్రైవేటీకరణ చేయాలనే ఉద్దేశంతో ప్రవీణ్‌ప్రకాష్ ఉపాధ్యాయులను, అధికారులను అక్రమంగా సస్పెండ్ చేస్తూ భయకంపిత వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆయా డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. పలువురు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా ప్రభుత్వం

మండపేట: అనారోగ్యంతో బాధ పడుతున్న వారికి ప్రభుత్వం అండగా నిలిచి అవసరమైన వైద్యసాయం అందిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు అన్నారు. మండలంలోని జెడ్.మేడపాడుకు చెందిన టి.నాగలక్ష్మి చర్మ వ్యాధితో బాధపడుతోంది. పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్ సమస్యను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దృష్టికి తీసుకువచ్చారు. వ్యాధి ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోవడంతో వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎమ్మెల్సీ తోట రూ.లక్ష మంజూరు చేయించారు. ఈ చెక్కును వీరబాబు, పార్టీ నాయకులు గారపాటి అశోక్‌కుమార్, తోరం శ్రీనివాస్‌లు బాధితురాలికి అందజేశారు. నాగలక్ష్మి కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు.

బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం: భట్లపాలిక శివారు సల్లపూడికి చెందిన తులసి సూర్యారావు, దంగేరు గ్రామానికి చెందిన మనిరాజు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలను జనసేన నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్ పరామర్శించి పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరఫున నిత్యావసరాలు అందజేశారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి వేణు, ఎంపీ బోస్



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, ఎంపీ బోస్



మాలపాడు సర్పంచ్ ప్రియాంకకు అవార్డు అందిస్తున్న మంత్రి వేణు, ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: రైతు శ్రేయస్సే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ అంబటి భవాని అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వేణు మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం రైతులకు అండగా నిలబడుతోందన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉపాధి హామీ పని దినాలు పెంచే విధంగా ఎంపీ నిధుల నుంచి కేటాయింపులు చేస్తానన్నారు. అనంతరం శాఖల వారీగా సమీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు మేర్నీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, ఎంపీడీఓ ఎస్.షిలత్‌రాజు పాల్గొన్నారు.

● పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని 9 విభాగాల్లో ఉత్తమ పంచాయతీలకు మంత్రి వేణు, ఎంపీ బోస్ అవార్డులను అందజేశారు. పేదరికం లేని, మెరుగైన జీవనోపాధుల గ్రామాలుగా వెల్ల, ఏరువల్లి, ఉట్రుమిల్లిలు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. ఆరోగ్యకర గ్రామంగా ఏరువల్లి, నెలవర్తిపాడు, కందులపాలెం, పిల్లల స్నేహపూర్వక గ్రామంగా ద్రాక్షారామ, వెల్ల, కాపవరం, నీటి సమృద్ధి కలిగిన గ్రామంగా ఉండూరు, కాపవరం, అన్నాయిపేట, పరిశుభ్రమైన, హరిత గ్రామంగా మాలపాడు, భీమక్రోసుపాలెం, అన్నాయిపేట, స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామంగా వెల్ల, వేగాయమ్మపేట, ద్రాక్షారామ, సామాజిక న్యాయం, సామాజిక భద్రత కలిగిన గ్రామంగా ఉండూరు, అన్నాయిపేట, వేగాయమ్మపేట, సుపరిపాలన కలిగిన గ్రామంగా వెల్ల, ద్రాక్షారామ, కందులపాలెం, మహిళా స్నేహపూర్వక గ్రామంగా ద్రాక్షారామ, వెలంపాలెం, ఏరువల్లి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఇవి కాకుండా ఇంటి పన్నుల వసూలులో పలు పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులను మంత్రి, ఎంపీ సత్కరించి, సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కాజులూరు: ఇటీవల బయో డీజిల్ ట్యాంకుల్లో పడి ఆర్యావటంకు చెందిన తాతపూడి మహేష్ (25), శీలకు చెందిన నెరేడుమిల్లి శివకుమార్ (25) మృతిచెందగా, ఆయా కుటుంబీకులను మంత్రి వేణుగోపాలకృష్ణ పరామర్శించారు. గొల్లపాలెంలో సంఘటనా స్థలాన్ని మంత్రి పరిశీలించి ఆర్యావటం, శీల గ్రామాల్లో మృతుల కుటుంబీకులను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. మంత్రి తనయుడు నరేన్, జెడ్పీటీసీ సభ్యుడు పనుం వెంకటసుబ్బారావు, పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, మాజీ ఎంపీటీసీ రాగం పోలరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ పథకాలను అమలు చేయాలి



సమావేశంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు

మండపేట: సంక్షేమ బోర్డులో గుర్తింపు పొందిన కార్మికులకు సంక్షేమ పథకాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టీవీ సత్యనారాయణ, మండపేట శాఖ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు కోరారు. రాష్ట్ర యూనియన్ చేపట్టిన ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సమగ్ర సర్వే యాత్రలో భాగంగా బుధవారం మండపేట వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కాపు కల్యాణ మండపంలో మండపేట న్యూ ప్రైవేట్ ఎలక్ట్రికల్, ప్లంబింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శెట్టి నాగేశ్వరరావు, సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు వృత్తిపరమైన పరికరాల కొనుగోలుకు రూ.రెండు లక్షల సబ్సిడీతో రుణ సదుపాయం కల్పించాలని, ప్రమాదంలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల పరిహారం అందజేయాలని, ఎలక్ట్రీషియన్ డేను ప్రభుత్వం గుర్తించాలని, ప్రతి మండలంలో ఎలక్ట్రికల్ సర్వీస్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. మండపేట వచ్చిన రాష్ట్ర నాయకులను ఇక్కడి యూనియన్ నాయకులు ఘనంగా సత్కరించారు. సంఘ నాయకులు శ్రీహరిరావు, రవిబాబు, కాళ్ల సత్తిబాబు, గుండు మురళీ, ముప్పిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్సీ తోట పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ టేకి గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కల బాలయ్యను ఆయన ఇంటి వద్ద ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బుధవారం పరామర్శించారు. నానమ్మ వియోగంతో బాధపడుతున్న వడమర ఖండ్రిక సొసైటీ చైర్మన్, అంగర గ్రామానికి చెందిన గంగుమళ్ళ రాంబాబును కూడా తోట పరామర్శించారు. వారి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన టేకి సర్పంచ్ కుక్కల నాగమణి, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు వెంట ఉన్నారు.

ఎంపీ బోస్ పరామర్శ

కపిలేశ్వరపురం: మాతృ వియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ టేకి గ్రామశాఖ అధ్యక్షుడు కుక్కల బాలయ్యను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ బుధవారం పరామర్శించారు. బాలయ్య మాతృమూర్తి భూషణం చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. బాలయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఏఎంసీ చైర్మన్‌గా సిరిపురపు

- నూతన పాలకవర్గాన్ని నియమిస్తూ ఉత్తర్వుల జారీ
- అభినందనలు తెలిపిన ఎమ్మెల్సీ తోట
- త్వరలో ప్రమాణ స్వీకారం



ఎమ్మెల్సీ తోటను మర్యాద పూర్వకంగా కలిసిన మండపేట ఏఎంసీ నూతన పాలకవర్గం



సిరిపురపు శ్రీనివాసరావు

మండపేట: మండపేట వ్యవసాయ మార్కెట్‌కు నూతన పాలక మండలిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కమిటీ చైర్మన్‌గా రాయవరం మండలం నదురుబాదకు చెందిన సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్‌గా మండపేట మండలం ద్వారపూడికి చెందిన చిక్కాల శ్రీనివాస్ నియమితులయ్యారు. త్వరలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం జరగనుంది. నియోజకవర్గంలోని మండపేట అర్బన్, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలతో ద్వారపూడి కేంద్రంగా 2020లో మండపేట అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఏర్పడింది. తొలి చైర్‌పర్సన్‌గా 2020 ఫిబ్రవరిలో రాయవరానికి చెందిన తేతల వనజ నియమితులయ్యారు. ఆ పాలకవర్గ పదవీకాలం ముగియడంతో కొత్త కమిటీని నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. చైర్మన్‌గా సిరిపురపు, వైస్ చైర్మన్‌గా చిక్కాల శ్రీనివాసరావు, సభ్యులుగా ముగ్గళ్ల పార్థకృష్ణ, పలివెల సుధాకర్, తుమ్మా రమాదేవి, నమతం పాపారావు, కొప్పిరెడ్డి పద్మావతి, కురుపూడి భువనేశ్వరి, కనికెళ్ల పల్లవి, చింతా సరస్వతి, నురుకుర్తి వీరవేణి, షేక్ మస్తాన్, కర్రి శ్రీతులసి, ప్రగడ సూర్యారావు, తాడి హరినారాయణరెడ్డి నియమితులయ్యారు.

ఎమ్మెల్సీ తోటను మర్యాద పూర్వకంగా కలిసిన నూతన పాలకవర్గం

ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాద పూర్వకంగా కలిశారు. తమ నియామకం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. రాయవరం జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, పార్టీ రాష్ట్ర నేతలు కొవ్వూరు త్రినాథరెడ్డి, సత్తి వెంకటరెడ్డి, తేతల నవీన్ రెడ్డి, నల్లమిల్లి చినకాపు తదితరులు ఎమ్మెల్సీ తోటను కలిశారు.

సిరిపురపునకు సముచిత స్థానం

దివంగత వైఎస్సార్ అభిమానిగా సిరిపురపు శ్రీనివాసరావు వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచీ పార్టీ బలోపేతానికి పనిచేశారు. ఓదార్పుయాత్ర, పాదయాత్రల్లో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వెన్నంటే ఉంటూ మైక్ శ్రీనుగా గుర్తింపు పొందారు. గతంలో నీటిసంఘం డైరెక్టర్‌గా, సొసైటీ అధ్యక్షుడిగా, నదురుబాద సర్పంచిగా, ఎంపీటీసీ సభ్యునిగా, రాయవరం ఎంపీపీగా, మండల ప్రతిపక్ష నాయకునిగా పనిచేశారు. అలాగే వైఎస్సార్ సీపీలో, వెలమ సంఘంలో సిరిపురపు పలు పదవులు నిర్వర్తించారు. త్వరలో నూతన కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం జరుగుతుంది. నూతన కమిటీకి మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జున చౌదరి, పార్టీ జగ్గంపేట, రంపచోడవరం నియోజకవర్గాల పరిశీలకులు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రాష్ట్ర నేతలు రెడ్డి రాజుబాబు, దూలం వెంకన్నబాబు తదితరులు అభినందనలు తెలిపారు.

మోదీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా పోరు

కపిలేశ్వరపురం: ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ పోరాటం చేస్తుందని ఆ పార్టీ జిల్లా సమితి సభ్యుడు చిట్టూరి నాగేంద్రప్రసాద్, సీనియర్ నాయకుడు గుత్తి నాగేశ్వరరావు అన్నారు. సీపీఐ రాష్ట్ర నాయకుల ఆధ్వర్యంలో జిల్లాలో సాగుతున్న జీప్ ప్రచార జాతాలో పాల్గొనేందుకు కపిలేశ్వరపురం నుంచి పార్టీ సభ్యులు బుధవారం రావులపాలెం తరలి వెళ్లారు. ఈమ జాతా రావులపాలెం, ఆలమూరు, గుమ్మిలేరు మీదుగా మండపేటకు చేరుకుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చిట్టూరి సత్యనారాయణ, గుత్తుల సత్యనారాయణ, చిట్టూరి సూరిబాబు పాల్గొన్నారు.

కల్యాణోత్సవానికి రాట మంచి పూజలు

రాయవరం: సోమేశ్వరంలోని బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాలకు బుధవారం రాట మంచి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రాట మంచి చేశారు. ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ కల్యాణోత్సవాల ప్రారంభ సూచికగా రాట మంచి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 1న స్వామివారి కల్యాణం, 4న రథోత్సవం, 6న పుష్ప ఉత్సవం నిర్వహిస్తున్నామని చెప్పారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- నల్లూరులో గడప గడపకూ..



నల్లూరు గ్రామస్తుల సమస్యలను వింటున్న ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం: పేదరికమనే అర్హతే ప్రామాణికంగా కుల,మత, ప్రాంతీయ తత్వాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని నల్లూరులో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, మండల సాగునలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, సర్పంచ్ కురుపూడి ఉదయశ్రీ, వైఎస్సార్ సీపీ యువ నేత, గ్రామ అధ్యక్షుడు కురుపూడి శివశంకర్, నాయకులు కురుపూడి రాంబాబులతో కలిసి ఇంటింటి పర్యటన చేశారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను స్థానిక ప్రజాప్రతినిధులు వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ దేశంలో మరెక్కడా లేని విధంగా మధ్యవర్తులు లేని పారదర్శక పాలనను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ముత్యాల నారాయణరావు, మార్ని పూసబ్బు, సవిలే శరత్‌బాబు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా ముఖ్యమంత్రి

- చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి
- పొదుపు సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన



ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు తదితరులు

మండపేట: మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేస్తున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఎగ్జిబిషన్ జరిగింది. పొదుపు సంఘాల మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువుల ప్రదర్శన, అమ్మకాల ఎగ్జిబిషన్‌ను వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబుతో కలిసి చైర్‌పర్సన్ దుర్గారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయాలకు మెప్మా బజార్ మంచి వేదికన్నారు. ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో మంచి ఉత్పత్తులు తీసుకు వచ్చి మార్కెటింగ్ చేసుకుని అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. రాజుబాబు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం ద్వారా పేదరికాన్ని అధిగమించవచ్చునన్నారు. ఎగ్జిబిషన్‌లో ఎంబ్రాయిడరీ చీరలు, అల్లికలు, పచ్చళ్లు, పిండివంటలు తదితర వాటిని ప్రదర్శించారు. వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, శెట్టి కల్యాణి, గ్రంధి శ్రీనివాస్, మెండు బాపిరాజు, బొక్కా సరస్వతి, లిల్లి శ్రీనివాస్, మెప్మా టీఈ అనంతలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

డివైడర్ ఆధునీకరణ పనులు ప్రారంభం

పట్టణంలోని మెయిన్ రోడ్డులో గల డివైడర్ ఆధునీకరణ పనులను బుధవారం చైర్ పర్సన్ దుర్గారాణి ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.10 లక్షలతో సెంట్రల్ డివైడర్‌కు టైల్స్ ఏర్పాటు చేయనున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు.

సంక్షిప్తంగా...


సోషల్ ఆడిట్‌పై శిక్షణ

కె.గంగవరం: స్థానిక ఎమ్మార్సీలో బుధవారం ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు సోషల్ ఆడిట్‌పై ఒకరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఎంఈఓ నాగరాజు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. ఎస్ఆర్‌జీ కేఆర్‌కే ప్రసాద్, హెచ్‌ఎంలు వెంకటేశ్వరరావు, పుల్లయ్య, ఎస్‌పీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

కె.గంగవరం: కోట శివారు రాజువైరి వద్ద ఏటిగట్టు రహదారిలో వంతెన వద్ద ప్రమాదాల నివారణకు స్థానిక యువత చొరవ తీసుకున్నారు. ఆక్విడెక్ట్ కమ్ అవుట్‌ఫాల్ స్లూయిస్ వద్ద నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారి ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కోట గ్రామ యువజన సంఘం సభ్యులు చొరవ తీసుకుని వంతెనకు ఇరువైపులా ఇనుప స్తంభాలు వేయించి దానికి అనుసంధానంగా మెస్‌ను ఏర్పాటు చేశారు.

రామచంద్రపురం డీఎస్పీగా అంబికా ప్రసాద్



రామచంద్రపురం: స్థానిక డీఎస్పీగా ఎం.అంబికా ప్రసాద్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన ఎం.బాల చంద్రారెడ్డి శ్రీకాకుళం జిల్లా టెక్కలికి, కాకినాడ జిల్లాలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా పనిచేస్తున్న అంబికా ప్రసాద్ రామచంద్రపురం డీఎస్పీగా వచ్చారు.

న్యాయమూర్తులకు సత్కారం



జడ్జిలను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళి, సాయిప్రసాద్

రామచంద్రపురం: స్థానిక కోర్టుల నుంచి బదిలీపై వెళ్తున్న న్యాయమూర్తులను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి బి.వాణిశ్రీ తిరుపతి కోర్టుకు, ఏజేఎఫ్‌సీఎం ఆశీర్వాదం పాల్ వరసారావు పేట కోర్టుకు బదిలీ అయ్యారు. బుధవారం స్థానిక బార్ అసోసియేషన్‌లో వారిని అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీమోహన వెంకటరమణ ఆధ్వర్యంలో సత్కరించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాడ్రే వు సాయిప్రసాద్, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, డీఎస్ఎస్ శర్మ, సభ్యులు పాల్గొన్నారు.

నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలి

రామచంద్రపురం: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్వీ రమణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ అధ్యక్షతన తృతీయ సంవత్సరం విద్యార్థులకు ఆరు నెలల ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ట్యాక్స్ కన్సల్టెంట్ బి.సీతాపతిరావు, కామర్స్ డిపార్టుమెంట్ హెడ్ ఆర్.వెంకటేశ్వర్లు, అకడమిక్ కోఆర్డినేటర్ కె.చిట్టిబాబు, ఉషశ్రీ, గీత, రాజేష్ పాల్గొన్నారు.

కేంద్ర విధానాలు తిప్పికొట్టాలి

రామచంద్రపురం: కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పి కొట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేగా ప్రభాకర్ అన్నారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ప్రచార భేరీలో భాగంగా బుధవారం రామచంద్రపురం ఎల్ఐసీ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆంధ్ర మాల్యాద్రి మాట్లాడుతూ వామపక్షాలు ఐక్యంగా నిలిచి రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపు నిచ్చారు. సీపీఎం నియోజకవర్గ కార్యదర్శి పెద్దిరెడ్డి రాము, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కృష్ణవేణి, సీపీఐ కొత్తపేట నియోజకవర్గ కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం జిల్లా నాయకులు దుర్గాప్రసాద్, సత్తిబాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లో పలు గ్రామాలకు గురువారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ ప్రసాద్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల నిమిత్తం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా ఉండదని ఏఈ ఎం.సూర్యనారాయణ తెలిపారు. కాజులూరు, తిప్పరాజుపాలెం, అయితపూడి, ఒంటితాడి, గొల్లపాలెం, ఆర్యావటం, శలపాక, తణుకువాడ, దేగలపేట, మొగలిపాలెం, శీల, మంజేరు, చేదువాడ, బందనపూడి, మతుకుమిల్లిలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అనధికార మోటార్ల తొలగింపు

కాజులూరు: గొల్లపాలెంలోని పలు గృహాల్లో కుళాయి కనెక్షన్లకు ఉన్న అనధికార విద్యుత్ మోటార్లను బుధవారం అధికారులు తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్, డీఎల్‌పీఓ వై.అమ్మాజీ, ఎంపీడీఓ సీహెచ్ ఇందిరాదేవి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు చెల్లుబోయిన వేణుగోపాలరావు, షేక్ జహంగీర్ తదితరులు అనధికార విద్యుత్ మోటార్లను గుర్తించి తొలగించారు.